# ఎగుడు - దిగుడు

రమాదేవి

శశి, శేఖర్ నాకు చాల దగ్గర స్నేహితులు. వాళ్ళిద్దరూకూడ పెళ్ళి కాక పూర్వం ఒకళ్ళకొకళ్ళు పరిచయమున్న వారే. కొద్దిపాటి స్నేహితులే అనికూడ చెప్పొచ్చు. శేఖర్ నాకు స్నేహితుడే కాకుండ బంధువుకూడా. మా శేఖర్‌ని చేసుకున్నాక, శశితో కేవలం స్నేహమే కాకుండ చుట్టరికం కూడ కలిసింది. శేఖర్ అంటే నాకు అభిమానం, ఒక విధంగా జాలికూడాను.

శేఖర్ ఉద్యోగంకోసం వెతకక, స్వంతంగా వ్యాపారం చేయడం మొదలుపెట్టాడు. అతనికి అనుకోకుండా చాల త్వరలో పెద్ద లాభం వచ్చింది. అతను అల్పసంతోషి. ఎంతో సంతోషపడ్డాడు. మమ్మల్నందర్నీ డిన్నరుకు పిలిచాడు. శశి మామూలుగ ఎప్పటిలాగే అందరికీ మర్యాదచేసింది. అందరూ అభినందనలు శశికికూడ అందజేసారు. ప్రతిగా శశి ధన్యవాదా లర్పించింది. కాని నా కెందుకో శేఖర్‌లో ఉన్నంత అమితోత్సాహం శశిలో కనపడలా. చాలా మామూలుగా ఉంది. అందరూ వెళ్ళిపోయారు. నన్ను ఆ రాత్రికి వాళ్ళింట్లోనే ఉండమని బలవంతం చేసారు ఇద్దరూ. ఉండిపోయాను, శశి సామాను అదీ సర్దుకుంటూ ఉండగా "శశీ.... కంగ్రాచ్యులేషన్స్" అన్నాను ప్రత్యేకంగా. "దేనికి" అంది ఒక్కసారి తెల్లబోయి. మళ్ళా వేంటనే గుర్తు తెచ్చుకుని "ఓహో...మా వ్యాపారంలో లాభం వచ్చిందనా.... అవునూ నిజంగానే వాళ్ళందరూ అభినందనలు చెబుతూ ఉంటే నాకు చాల తమాషాగా అనిపించింది. నువ్వు నమ్మవేమోగాని....నేను నిన్నటినుంచి "చాలా లాభం వచ్చింది.. లాభం వచ్చింది" అని పదేపదే గుర్తుకు తెచ్చుకుంటున్నాను. లేకపోతే అంత ప్రత్యేకంగా గుర్తుండదేమోననిభయం" అంది. శేఖర్ గదిలోకి వస్తూ శశి మాటలు విన్నాడు. "శశీ... పరాయి వాళ్ళందరికికూడ అంత సంతోషంగా ఉంటే నీ కెందుకని అంత ఉషారుగ లేదు. నేను ఎంతో సంబరంగా 'మొట్టమొదట నీకు చెప్పాలి.... నువ్వు విని ఎంత సంతోషపడతావో అనుకుంటూ

ఎంతో ఆశతో ఇంటికి వచ్చి నీతో చెప్పాను. విని "అవునా....బావుంది" అన్నావు. అక్కడికీ తెచ్చి తిన్నట్టు కన పడకుండా "స్నేహితులంతా పార్టీ ఇవ్వ మంటున్నారు. రేపు డిన్నరుకు పిలవనా" అంటే "తప్పకుండా" అన్నావు. అంతే మళ్ళీ ఆ సంగతే ఎత్తలేదు నువ్వు" అన్నాడు శేఖర్ మనస్సు కష్టపెట్టు కుంటూ.

"నేనేం చేయను. అదిమామూలు రొటిన్‌గా కనపడింది. అక్కడికీ చాలా ప్రయత్నించాను. చాలసంతోషంగా కన పడాలిఅని ...ఆ మాట వినగానే నాకూ సంతోషం వేసింది. ఇంకా ఎక్కువ ఎక్కడనుంచి తెచ్చుకోను" అంది శశి నీళ్ల తిరిగినకళ్ళను మాకు కనపడనీయ కుండా ముఖం కిందికి దించుకుంటూ.

"సంతోష పడాల్సినప్పుడు సంతోష పడి, విచారంకలిగి నప్పుడు విచారిస్తేనే కాని ఏమిటో నాకు మనుష్యులు లాగ కనపడరు....దేనికీ చలించకుడా ఉంటే శిలల్లాగ అనిపించరూ ఇంక 'లైఫ్' ఏమిటి?" అన్నాడు శేఖర్....

ఇద్దరిమధ్యా అఖాతాలు ఏర్పడడం మొదలుపెట్టాయి. అలాగే రెండేళ్ళు గడిచాయి. ఆ రెండేళ్ళల్లో శేఖర్‌ని తృప్తిపరచడానికి శశి ఎంతో తనని తాను మార్చుకుని సరిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ ఉండేది.

మొదట ఒక్కసారిగ లాభాలు వచ్చిన వ్యాపారం ఒక్కసారిగ పడి పోయింది. అసలుకే మోసం వచ్చింది. శేఖర్ తట్టుకోలేకపోయాడు. జబ్బు పడ్డాడు. శేఖర్ తట్టుకోలేక బాధపడు తున్నాడే అన్న దిగులుతప్ప, నష్టం వచ్చిందన్న దిగులు ఏ కొంచెమూ కన పడలా శశిలో, "వ్యాపారం అన్నాక లాభం, నష్టం రెండూ ఉంటాయిగా.... ఇది పెద్ద అనుకోనిసంఘటనగా నాకేమి కనపడటం లేదు" అంది శశి నాతో, నేను వాళ్ళింటికి చూద్దామనివెళ్ళినప్పుడు. తను లెక్చెరర్‌గా చేరింది ఆర్థికంగా ఇబ్బంది ఉండదని. శేఖర్‌ని ఉద్యోగం చేయమని బలవంతపెట్టలేదు.వంటింట్లో శేఖర్‌కి గ్లూకోస్ నీళ్ళు కలుపుతూ "శేఖర్‌కింకా పసితనంకదూ"అందిశశి.

గ్లూకోస్‌నీళ్ళు తాగుతూ పనిమీద లోనకు వెళుతున్న శశివంక ఏదో ఆరాధ నతో చూసాడు శేఖర్.... "శశి దేవత కదూ.... ఎందుకో నా కనిపిస్తుంది తన స్థాయికి నే నీ జీవితంలో చేరుకోలే నేమో నని. ఏ పరిస్థితుల్లోనైనా ఎంత హుందాగ, నిదానంగ ఉంటుందో చూసావా" అన్నాడు శేఖర్, శశి మాన సిక స్థాయిని గుర్తించి.

అందుకే నాకు, ఎగుడుదిగుడులకు అతీతంగాఉండే శశి అంటే గౌరవం. వాటికి వశమయ్యే శేఖర్ అంటే జాలి. ★